క్లుప్తంగా

జేపీఎన్‌సీఈ చైర్మన్‌కు మాజీమంత్రి పరామర్శ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అనారోగ్యం కారణంగా ఇటీవల హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన జేపీఎన్‌సీఈ చైర్మన్ రవికుమార్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శనివారం పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆయన ఇంటికెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చిన్నచింతకుంట: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కౌకుంట్ల మండలం దాసర్‌పల్లికి చెందిన తేజశ్విని అనారోగ్యంతో బాధ పడుతూ హైదరబాద్ కొండపూర్‌లోని కిమ్స్‌లో చికిత్స పొందింది. అందుకు ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి వచ్చిన 4.60 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శనివారం దమగ్నాపూర్‌లో ఎమ్మెల్యే అందజేశారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

జడ్చర్ల: స్థానిక మినీ స్టేడియంలో శనివారం అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు ప్రారంభయ్యాయి. పోటీల్లో మొత్తం 14 పాఠశాలల నుంచి టీమ్‌లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు జరిగిన పోటీల్లో న్యూ సన్‌రైస్ స్కూల్ జట్టుపై స్వామి నారాయణ గురుకుల జట్టు విజయం సాధించింది. అదే విధంగా పెద్ద ఆదిరాల జెడ్పీహెచ్‌ఎస్ జట్టుపై జెయింట్ ఆగ్నేస్ స్కూల్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిశంకర్, రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

భూత్పూర్: మండలంలోని తాటికొండకు చెందిన మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. తాటికొండకు చెందిన బోయ చెన్నమ్మ శుక్రవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో నిద్రించారు. శనివారం ఉదయం చూడగా కనిపించకపోవడంతో గ్రామంలో, బంధువుల ఇండ్లల్లో వేతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా వరాహగిరి గట్టు చెన్నకేశస్వామి ఉత్సవాలు



గండేడ్: వరాహగిరి గట్టు చెన్నకేశస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఏటా శ్రావణమాసం నాలుగో శనివారం ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిదర్శనానికి బారులుదీరారు. మెట్లదారిలో వెళ్లి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. భక్తులతో ప్రాంతమంతా కోలాహలంగా మారింది. గుట్టల చుట్టూ జనంతో కళకళలాడింది. మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ సిబ్బందితో క్యాంప్ నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీపీఆర్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: టీపీఆర్టీయూ జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్యాంబాబు, కార్యదర్శిగా భూపతి సింగ్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని టీపీఆర్టీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

నవాబుపేట: యాదవులంతా సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని యాదవ సంఘం నాయకులు యాదయ్య, వెంకటయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవాన్ ధ్వజాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మాజీ సర్పంచ్ వెంకటయ్య, అంజయ్య, మాదవులు, శ్రీనివాస్, కేశవులు, మలేశ్, శ్రీను, జైపాల్, నర్సింహులు, యాదయ్య, నరేశ్, రఘు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నమో భగవతే వాసుదేవాయ

- భక్తిశ్రద్ధలతో జన్మాష్టమి ఉత్సవాలు
- శోభాయమానంగా బాసిల్లిన మురళీకృష్ణ మందిరం
- కృష్ణగిరిలో కిక్కిరిసిన భక్తులు



గుడిబండలో శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగింపు



నవాబుపేటలో శ్రీకృష్ణపరమాత్మ ఊరేగింపు



శివశక్తినగర్‌లో వీహెచ్‌పీ నాయకులు



టీటీడీ కల్యాణ మండపంలో ఇస్కాన్ భక్తి వృక్ష ఆధ్వర్యంలో చిన్నారులు



అప్పన్నపల్లిలో ఉట్ల ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



నవాబుపేటలో బాలికల కోలాటం





మద్దిగట్లలో శ్రీకృషుడి ప్రతిమ ఊరేగింపులో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పద్మావతికాలనీలోని కృష్ణగిరి–మురళీకృష్ణ మందిరంలోని శ్రీకృష్ణ విగ్రహాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామివారికి అభిషేకం, అఖండ దీపారాధన, పుణ్యవచనం చేసి మహానైవేద్యం సమర్పించారు. రాత్రి విశేషపూజలతోపాటు సామూహిక కృష్ణాష్టోత్తర శతనామావళి, భజన, ఉయ్యాల సేవ, మహానైవేద్యం, మంగళహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. శ్రీకృష్ణుడి వేషధారణలతో చిన్నారులు అలరించారు. శివశక్తినగర్‌లోని వీహెచ్‌పీ కార్యాలయంలో స్థాపన దినోత్సవం నిర్వహించారు. అప్పన్నపల్లిలోని వినాయక మండప ప్రాంగణంలో శనివారం రాత్రి ఉట్ల ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు పోటాపోటీగా ఉట్లు కొట్టి ఆకట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఇస్కాన్ భక్తి వృక్ష ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉట్లోత్సవం వేడుకగా సాగింది. పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ నాయకులు ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సంగీత, రవితేజ, గోపాల్, హరికృష్ణ, విష్ణు, వంశి తదితరులు పాల్గొన్నారు.

❖ జడ్చర్లలో వీహెచ్‌పీ నాయకులు అయ్యప్ప స్వామి ఆలయం, బ్రహ్మకుమారీస్ రాజయోగ కేంద్రంలో ఉట్లనుకొట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు అఖిల్‌రెడ్డి, రంజిత్‌బాబు, పరమాత్మ నంద గిరిస్వామి, బీకే సుజ్ఞాని లయన్స్ నటరాజ్, వినయ్‌కుమార్, రాఘువయ్య పాల్గొన్నారు.

❖ భూత్పూర్ మండలంలోని మద్దిగట్లలో శనివారం శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగింపుంచారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కవిత కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పురవీధుల్లో భజనలు, నృత్యాలతో ఊరేగించారు. భగవద్గీత శ్లోక ఉచ్చారణలతో భక్తులు పరవశించారు.

❖ భూత్పూర్: అడ్డాకుల మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉట్టు కొట్టే కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు.

❖ అడ్డాకుల మండలంలోని గుడిబండలోని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక గుడిబండ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ ప్రతిమను ఊరేగించారు.

❖ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్, జక్లపల్లి, ఆశిరెడ్డిపల్లి, గండేడ్, కొంరెడ్డిపల్లి, పెద్దవార్వాల్, రుసుంపల్లి తదితర గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేక పూజులు, అభిషేకాలు నిర్వహించారు. పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులతో గోపికలు, శీకృష్ణుడి వేషధారణలో బాలబాలికలు అలరించారు. ఉట్టికొట్టి భక్తిపారవశ్యంతో మునిగి తేలారు.

❖ మహమ్మదాబాద్ మండలవ్యాప్తంగా యువజన సంఘాలు ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. బాష్యం విద్యానికేతన్ పాఠశాలలో చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేశాధారణతో ఆకట్టుకున్నారు. కృష్ణుడి ప్రత్యేక గీతాలతో నృత్యాలు చేసి ఉట్టికొట్టారు.

❖ నవాబుపేట మండల కేంద్రంతోపాటు కాకర్లపహాడ్‌లో త్రైతసిద్ధాంత సంఘం ఆధ్వర్యంలో కృష్ణుడి విగ్రహం ఊరేగించారు. ఆటపాటలు, చిన్నారుల కొలాటాలు ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ, గోపికల వేషదారణలో చిన్నారులు అలరించారు. ఆలయాల చెంత ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు.



కృష్ణ మందిరంలో హారతి ఇస్తున్న పూజారి



జక్లపల్లిలో గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలో..



జడ్చర్ల అయ్యప్పస్వామి ఆలయంలో



గాంధిర్యాల్‌లో వీరహనుమాన్ భక్తులు

ఏటా వ్యవసాయం భారంగా!

- కూలీల కొరతతో అన్నదాతల అవస్థలు
- ఏటా పెరుగుతున్న కూలీల ధరలు
- నాట్లు, అంచులకు ఇతర ప్రాంతాల నుంచి తరలింపు
- సాగులో సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు



గండేడ్‌లో నాటు వేస్తున్న కూలీలు

గండేడ్: వ్యవసాయం ఏఏడుకాఏడు భారంగా మారుతోంది. వేధిస్తున్న కూలీల కొరత, పెరిగిన కూలీ రేట్లు, ఎరువుల ధరలతోపాటు యాంత్రీకరణలో వెనుకంజ వెరసి సాగంటేనే అన్నదాతలు ఆందోళన చెందే పరిస్థితి వచ్చింది. ఏటేటా సమస్య జఠిలమవుతుండడంతో అన్నదాతలు ఊపిరి సలుపుకోలేకపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బతుకుదెరువు కోసం సాగు ఊబిలో దిగి అష్టకష్టాలు పడుతున్నారు.

❖ గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో సుమారు 32 వేల ఎకరాల సాగు భూమి ఉంది. ప్రతిఏటా 28వేల ఎకరాల వరకు సాగవ్వగా అందులో సుమారు 24వేల ఎకరాల వరకు వరి సాగువుతుంది. మహమ్మదాబాద్ మండలంలో ప్రతిఏటా సుమారు 11వేల ఎకరాల వరకు సాగువుతుండగా గండేడ్ మండలంలో 12వేల ఏకరాకలకు పై చిలుకు సాగవుతుంది. బల్సూర్‌గొండ, పెద్దవార్వాల్, చిన్నవార్వాల్, జిన్నారం, గాదిర్యాల్ ,రుసుంపల్లి, మహమ్మదాబాద్, గండేడ్, వెన్నాచేడ్, నంచర్ల, కొంరెడ్డిపల్లి, మొకర్లాబాద్, పగిడ్యాల్ తదితర గ్రామాల్లో వరి సాగవుతుంది. రెండు మండలాల్లోనూ వరి ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. ప్రతిఏటా సాగులో రైతులు సవాలక్ష సమస్యలు ఎదుర్కొంటున్నారు.

కూలి రూ.వెయ్యి..

వర్షాలు ఆశించిన స్థాయిలో పడడంతోపాటు చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. దీంతో మండలంలో సాగుపనులు ఊపందుకున్నాయి. 60శాతానికిపైగా బోర్లు ఉండడంతో 70శాతం వరకు వరిసాగవుతున్నది. దీంతో సాగులో కూలీల వినియోగం తప్పనిసరి నేపథ్యంలో ఒక్కరోజుకు చెల్లించే కూలీ డబ్బులు కూడా పెరిగాయి. గ్రామాల్లో కూలీలకు గతేడాది రూ.500నుంచి 800 వరకు ఉంటే ఈ సంవత్సరం ఏకంగా రూ.1000 వరకు పెరిగింది. అయినా కూడా కూలీలు దొరకడం లేదు. మగవారికి గతేడాది రూ.800 ఉంటే ఈసారి రూ.1000కి తక్కువ ఇస్తే రామని చెబుతున్నారు. పదిహేను రోజులుగా కూలీలు రాక పలు గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి

స్థానికంగా కూలీల కొరత ఉండడంతో రైతులు పక్క జిల్లా కూలీలపై దృష్టిసారిస్తున్నారు. ఇక్కడ ఉన్నవారు ఎక్కువ డబ్బులు వస్తాయని పక్క జిల్లాలకు వెళ్తుంటే.. రైతులు మాత్రం పక్క జిల్లాల కూలీలపై ఆధారపడుతున్నారు. నారాయణపేట జిల్లా కోస్గిలో అడ్డా కూలీలను ఆశ్రయించడంతోపాటు గుండుమాల్, బిజ్జారం, దోరేపల్లి, హన్వాడ మండలం ఇబ్రహీంబాద్, సూరారం, కొత్తాబాద్ తదితర గ్రామాల నుంచి వరినాట్లు వేయడానికి ఉమ్మడి మండలాల్లోని గ్రామాలకు వస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా సాగు విస్తీర్ణం ఒకే దశలో కొనసాగగా.. ఈ ఏడాది కొంత తగ్గనుంది.

అందుబాటులోలేని యంత్రాలు

వరిసాగుకు ఒక్క ట్రాక్టర్లు మాత్రం కరిగెట చేయడం తప్పా.. కూలీల కొరతను అధిగమించేందుకు ఇతర యంత్రాలు ఏవీ ఈ ప్రాంతంలో అందుబాటులో లేవు. కొన్నిచోట్ల గొర్రు ట్రాక్టర్‌తో వేస్తున్నా.. అందుబాటులో లేనివారు ఇబ్బందులు పడుతున్నారు. నాట్లు వేసే యంత్రాలు మార్కెట్లోకి వచ్చిన స్థానికంగా ఇంకా వాడకంలోకి రాలేదు. దీంతో కూలీల వినియోగం తప్పని సరి అయింది. కరిగెట మినహా అంచులు తీయడం, గొర్రు, నాటు వేయడం అన్నింటికి కూడా కూలీల అవసరం తప్పదు. దీంతో వారికి డిమాండ్ బాగా పెరిగింది. ఎరువుల ధరలు కూడా దాదాపు 200నుంచి 300ల వరకు పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

కామినిపల్లి నుంచి పిలిపించా..



స్థానికంగా కూలీల కొరత కారణంగా కూలీలను కుల్కచర్ల మండలం కామినిపల్లి నుంచి పిలిపించా. పదెకరాల్లో నాటు వేశాను. రెండురోజులు అంచులు తీయడంతోపాటు నారు మోయడానికి అందించడానికి 28మంది కూలీలు పట్టారు. వీరికి ఒక్కొక్కరికి రూ.1000తోపాటు తిండి ఇతరత్రా ఖర్చులు ఇచ్చాను. నాటు వేయడానికి గండేడ్ నుంచి కూలీలను తీసుకొచ్చాను. గతేడాది కంటే ఈ ఏడాది ఎకరాకు రూ.6వేల అదనపు భారం పడింది. రానున్న రోజుల్లో పరిస్థితి ఇలాగే ఉంటే వ్యవసాయం చేయడం కష్టం.

– శ్రీనివాస్‌రెడ్డి, రెడ్డిపల్లి

బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: బీజేపీ జిల్లా కార్యవర్గాన్ని శనివారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా భరత్‌భూషణ్, గాల్‌రెడ్డి, క్రిస్టియ నాయక్, రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్‌రెడ్డి, రమేశ్‌కుమార్, రాజేశ్వర్, కార్యదర్శులుగా పద్మవేణి, సబిరెడ్డి నారాయణమ్మ, వెంకటేశ్వరమ్మ, రవీందర్‌రెడ్డి, అశోక్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా వెంకటయ్య, కార్యాలయ ప్రముఖ్‌గా సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా కన్వీనర్‌గా విశాల్, మీడియా సెల్ కన్వీనర్‌గా సతీశ్‌కుమార్, ఐటీసెల్ కన్వీనర్‌గా శ్రీధర్‌ను ఎంపిక చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు, మోర్చా కమిటీ సభ్యులను త్వరలో నియామించనున్నట్లు పేర్కొన్నారు.

బీటీరోడ్డు మరమ్మతు ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు నగర పరిధిలోని అప్పన్నపల్లి–దివిటిపల్లి మధ్య ఊరచెరువు కట్టపై బీటీ రోడ్డు మరమ్మతు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలకు ఈనెల 14న ఈ రోడ్డు కొంత మేర కోతకు గురైంది. అదేరోజు ఈ ప్రాంతాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించి వెంటనే పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జె.చంద్రశేఖర్, వై.సురేందర్ రెడ్డి, అనంతరెడ్డి, బాలు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి



దేవరకద్రలో నిల్వనీటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

దేవరకద్ర: భారీగా కురుస్తున్న వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణయ్య కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్‌నగర్, హరిజనవాడను సందర్శించారు. ఈ సందర్భంగా పాతఇళ్లను పరిశీలించారు. కూలిపోయే స్థితిలో ఉన్న పాత ఇళ్లల్లో నివాసం ఉండరాదని సూచించారు. ఇళ్లముందున్న సంపుల్లో, హౌస్‌లలో నిల్వనీటిని పార బోయించారు. నీటినిల్వలతో దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు పరిశుభ్రతను పాటించాలని, ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటినిల్వలు లేకుండ చూసుకోవాలని కోరారు.

ఆర్టీసీ కార్గో హమాలీ రేట్లు పెంచాలి

మహబూబ్ నగర్ న్యూటౌన్: ఆర్టీసీ కార్గో హమాలీ కార్మికుల రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కార్గో హమాలీ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ నేతృత్వంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఆర్టీసీ ట్రాన్స్ పోర్టరంగాన్ని ఆర్టీసీ యాజమాన్యం నిర్వహించేదని.. ప్రస్తుతం కార్గో నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు టెండర్ల ద్వారా నిర్వాహణ ఇవ్వడంతో ట్రాన్స్‌పోర్ట్‌రంగం కార్గోలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికీ శ్రమకు తగిన రేట్లు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హమాలీ రేట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు దేవానంద్, కార్గో హమాలీ కార్మికులు రాములు, రవికుమార్, సతీశ్, నరేశ్, సుధీర్, కృష్ణ, పాషా, అంజి, గిరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల ఆశాజ్యోతి లచ్చన్న



నివాళులర్పిస్తున్న బీసీ సమాజ్ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వాతంత్ర్య సమయ యోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గౌతులచ్చన్న అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో గౌతు లచ్చన్న చిత్రపటానికి పూల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ అని పిలిపించుకునేంత గౌరవం దక్కించుకున్నారన్నారు. జాతీయ నాయకులతో కలిసి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొని చాలా నెలలుగా జైలుజీవితం అనుభవించారన్నారు. మర్రిచెన్నారెడ్డితో కలిసి ప్రత్యేక తెలంగాణ కొరకు చేతులు కలిపి తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని వివరిస్తూ ఒక పుస్తకం కూడా రాశారని కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, వడ్డెర సంఘం జిలా అధ్యక్షుడు చంద్రయ్య, జాండ్ర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మహేందర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

‘ప్రమాదంలో ఆదివాసీల జీవనం’



మాట్లాడుతున్న చంద్రమౌళి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దేశంలో ఆదివాసులు జీవించే హక్కు పూర్తిగా ప్రమాదంలో పడిందని టీఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 24వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో మనుషులను చంపుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. అమాయకులైన గిరిజనులు, ఆదివాసీలు స్వేచ్ఛగా తిరగలేక జీవనాధారం కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా సమన్వయకర్త వామన్కుమార్, కన్వీనర్ బాలయ్య, గోపాల్, అరుణ్కుమార్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులైనా పూర్తికాలే



పాత రైల్వేగేటుకు ఇటువైపు వాహనాలు నిలిపి కాలినడకన వెళ్తున్న ప్రజలు

- ఆర్‌యూబీలో నిలిచిన వర్షపు నీరు
- పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇక్కట్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎడతెరపి లేకుండా ఇటీవల రోజులుగా కురిసిన భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలోని ఆయా రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ల కింద నీళ్లు చేరాయి. దీంతో పాదచారులు, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా ఈనెల 14వ తేదీ ఉదయం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని అండర్ పాస్రిటెయినింగ్ వాల్ కూలిపోయినందున భారీగా వరదతోపాటు బురద పేరుకుపోయింది. మూడురోజులైనా బురద తొలగింపు పనులు పూర్తి కాకపోవడంతో బ్రిడ్జి కింద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇక రైల్వేస్టేషన్ సమీపంలోని మోతీనగర్కు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీళ్లు చేరాయి. అలాగే అప్పన్నపల్లి వద్ద ఉన్న ఆర్‌యూబీ వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. అండర్ బ్రిడ్జిల వద్ద చేరుతున్న వర్షం నీటిని ఎప్పటికప్పుడు తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.



ఒకరిని నియమించాలి



హనుమాన్‌పుర ఆర్‌యూబీ వద్ద ఎల్లప్పుడూ ఒకరు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ సీజన్‌లో ఎప్పుడు వర్షపు కురిసినా ఇది నిండిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. నగరానికి వచ్చి నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి గాని, పని మీద వెళ్లేందుకు నానా తంటాలు పడుతున్నాం. బైక్‌ను అటువైపు ఉంచి పాతగేటు ద్వారా నడిచి ఇవతలికి వచ్చి పనులు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా పాత రైల్వేగేటు తెరవాలి. అప్పుడే సమస్య పరిష్కారవుతుంది.

– నర్సింహులు, భవన నిర్మాణ మేస్త్రీ, పాలిటెక్నిక్ ఏరియా

ఆర్‌యూబీ ఒక్కటేమార్గం

మా తండాలో సుమారు 600మంది నివసిస్తున్నారు. మహబూబ్‌నగర్ నగరానికి 3కి.మీ. దూరంలో ఉంది. అటువైపు వెళ్లడానికి హనుమాన్‌పుర ఆర్‌యూబీ ఒక్కటే మార్గం. అదికూడా వర్షం కురిసినప్పుడు నిండిపోతోంది. తాజా గా మిషన్ భగీరథ పథకం పైపులైన్ పగిలిపోయింది. వెంటనే వరదతోపాటు బురదను తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలి.ఏ సరుకులు తెచ్చుకోవాలన్నా నగరానికి రావాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. పాతగేటు తెరిస్తే బాగుంటుంది.

– సునీల్‌నాయక్, డిగ్రీ విద్యార్థి, తొల్లబండ తండా